‘చేనేత’కు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- వీవర్స్ శాల పరిశీలన

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆటోనగర్‌లోని హ్యాండ్లూమ్ డెవలప్ సెంటర్ వీవర్స్ శాలను టిడ్కో నివాసాల వద్ద ఏర్పాటు చేసిన చేనేత కేంద్రాలను, యర్రబాలెంలోని ఆప్కో గోడౌన్ ఆవరణలో ఉన్న సర్వసతి చేనేత పారిశ్రామికులు సహకార ఉత్పత్తి, విక్రయ వర్క్‌షెడ్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివృద్ధికి అవసరమై మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలపై శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వ రాయితీ పథకాల అమలుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. రాష్ట్ర మానవ వనరులు ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల ద్వారా మగ్గాల పై చీరలు నేసే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. చేనేత ఉత్పత్తి కేంద్రాల వద్ద సోలార్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ వనజ, తహసీల్దార్ సుభాని, కమిషనర్ ఆలీంబాషా, కో ఆర్డినేటర్ శాంతి పాల్గొన్నారు.


ఆటోనగర్‌లోని వీవర్స్ శాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

క్లుప్తంగా

క్రమశిక్షణతోనే ఉన్నతస్థానం

ఫిరంగిపురం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించడం ద్వారానే ఉన్నత స్థానం సాధించవచ్చని సర్పంచి ఎం.శివ కుమారి పేర్కొన్నారు. మండలంలోని మండలపరిషత్, హెచ్‌డబ్ల్యూ, డీడబ్ల్యూ పాఠశాలల్లోని విద్యార్థులకు చల్లా బంగారెడ్డి సహకారంతో పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, మందాల రామిరెడ్డి, ఎం.బాలమ్మ, కోటిరెడ్డి, శివశంకర్, మరియదాసు, జగన్నాథరెడ్డి, ప్రకాష్, కె.రామిరెడ్డి,శ్రీనివాస రెడ్డి, అశోక్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కమల్‌మోహన్, ఉపాధ్యాయులు బాలు రవికుమార్, సుందరరావు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



మంగళగిరి: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిర స్మరణీయం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కొనియాడారు. పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పారేపల్లి మహేష్, రాజ్ కిరణ్, ఉడతా శ్రీనివాసరావు, గోపి, పవన్ పాల్గొన్నారు.

దుగ్గిరాల తహసీల్దార్‌గా సునీత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల తహసీల్దార్‌గా ఐ.సునీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సునీత గతంలో పల్నాడు జిల్లా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో దుగ్గిరాలలో డిప్యూటీ తహసీల్దార్‌గా కొంతకాలం విధులు నిర్వహించారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని రామచంద్రాపురంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్క్ వద్ద భారత మాజీ ప్రధాని, భారతరత్న దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. పార్టీ నాయకుడు భీమిరెడ్డి అంజిరెడ్డి, వాజ్‌పేయ్ శిలాఫలకానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉమ్మడి పౌరస్మృతిపై పునరాలోచన చేయాలి

లక్ష్మీపురం: ఉమ్మడి పౌరస్మృతిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ నాయకులు మహమ్మద్ కలీం కోరారు. స్థానిక ముస్లిం జేఏసీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రయత్నించటం తప్పు కాదు కానీ బలవంతం, ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. మైనార్టీలలో మెజార్టీ వర్గంగా ఉన్న ముస్లిం సమాజానికి కేంద్ర మంత్రివర్గంలో స్థానం లేకపోవడంపై మోదీ ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. 238 సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్‌తో కౌన్సిల్ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుందని చెప్పారు.

అవోపా ఆధ్వర్యంలో గోసేవ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారి తోటలోని రాధాకృష్ణ గోశాలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో గోసేవ, గోపూజ నిర్వహించారు. అనంతరం మహిళలు మహాలక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. సభ్యులకు గోవు ఉత్పత్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాల్‌రావు, చామర్తి రమేష్, మిరియాల మోహనరావు పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడు వేణుగోపాల్‌కు పీహెచ్‌డీ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన సీనియర్ గణితశాస్త్ర అధ్యాపకుడు పరిగె వేణుగోపాల్, ఏఎన్‌యూ ఎడ్యుకేషన్ విభాగం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. ‘ఎమోషనల్ ఇంటిలిజెన్స్ సెల్ఫ్ కాన్సెప్ట్ అండ్ అడ్జస్ట్‌మెంట్స్ ఇన్ రిలేషన్ టు అకడమిక్ అచీవ్‌మెంట్ ఆఫ్ ఇంటర్మీడియెట్ స్టడీస్’ అనే అంశంపై ఆంధ్ర లూథరన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయన పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈసందర్భంగా శుక్రవారం డాక్టర్ ఎస్తేరు సునీలతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు పీవీ రాజేశ్వరి, ఎస్వీఆర్ ప్రసాద్, డాక్టర్ వేణుగోపాల్‌ను అభినందించారు.

డ్రెయినేజీ పనుల వద్ద వివాదం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రూరల్ గుండిమెడలో డ్రెయినేజీ పైపులైను వద్ద జరిగిన వివాదాన్ని శుక్రవారం పరిశీలించేందుకు వచ్చిన పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ ముందే వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు అర్జున్‌రావుపై టీడీపీ కార్యకర్త రమేష్ దాడి చేశాడు. తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో అర్జున్‌రావు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మిరియాల రాంబాబు, న్యాయవాది బాజిగంగాధర్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి.. తాడేపల్లి పోలీసులను జరిగిన ఘటనపై వివరణ కోరారు. అప్పటికప్పుడు టీడీపీ కార్యకర్త రమేష్ వద్ద ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. గాయాలైన అర్జున్‌రావును లోపల కూర్చొబెట్టి, రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఎలా నమోదు చేస్తారంటూ పోలీసులను ప్రశ్నించడంతో, గాయపడిన అర్జున్‌రావు ఫిర్యాదు కూడా నమోదు చేస్తామని బదులిచ్చారు. ఘటనపై సీఐ కళ్యాణ్‌రాజును వివరణ కోసం ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మహిళ గల్లంతు


గల్లంతైన మహిళ రమా(ఫైల్)

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లో ఓ మహిళ శుక్రవారం గల్లంతు అయింది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన సాంబయ్య, రమా భార్యాభర్తలు. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. వారికి వివాహాలు చేశారు. వైఎస్సార్ కాలనీలో ఉండే రమా కేఎల్ రావు కాలనీలో నివసించే తల్లి రూతమ్మ ఇంటికి ఈనెల 13వ తేదీ వచ్చింది. సాయంత్రం సమయంలో కొట్టుకు వెళ్తానని చెప్పి ఇంటికి రాకపోవడంతో తల్లి పదే పదే ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం లేదు. రాత్రి సమయంలో నా గురించి వెతకవద్దు అంటూ వాయిస్ మెసేజ్ పెట్టింది. తల్లి రూతమ్మ చుట్టుపక్కల వెతుకుతుండగా కృష్ణానది అమరావతి కరకట్ట వెంబడి బకింగ్‌హామ్ కెనాల్‌పై చెప్పులు కనబడడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వచ్చి ఫిర్యాదు చేసిందని, బకింగ్‌హామ్ కెనాల్‌లో దూకి గల్లంతైందని భావిస్తున్నామన్నారు. ఘటనపై రమా తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టణంలోని ఆత్మకూరు శ్రీనివాసకాలనీ, బైపాస్‌కు పడమర వైపు, ఎల్‌బీ నగర్, 6వ బెటాలియన్, హ్యాపీ రిసార్ట్స్ ఏరియా, హనుమాన్ నగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనుమాక హెచ్‌ఎంకు పీహెచ్‌డీ


పూర్ణచంద్రశేఖర రావు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం విం జమూరి పూర్ణచంద్రశేఖర రావు పీహెచ్‌డీ అందుకున్నారు. ‘కాట్రగడ్డ దయానంద సాహిత్యం పరిశీలన’పై పరిశోధన చేయడంతో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి వారు పీహెచ్‌డీ డిగ్రీ అవార్డును ప్రకటించారు. ఇక్కడే చదువుకున్న విద్యార్థి అదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా వచ్చి అరుదైన గౌరవం లభించడంతో శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఆ ప్రధానోపాధ్యాయుడ్ని సన్మానించారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



మంగళగిరి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరాలని ఓటర్లు నమోదు అధికారి లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2025 ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఇంటింటి సర్వే జరుగుతుందని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మాబు సుభాని, డెప్యూటీ తహసీల్దార్ ఎస్.సతీష్, రాజేష్, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శకుంతల, డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ షేక్ దరియావలి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

సీపీఎం నాయకులు బాబూరావు


మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: ప్రభుత్వం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల సమస్యలకు ప్రాధాన్య ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు కోరారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు అధ్యక్షతన వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంగళగిరి నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాపితంగా సుమారు లక్ష కుటుంబాలు దీర్ఘకాలంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. రాష్ట్ర వ్యాపితంగా స్కీంవర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులు, ఇతర చిరుద్యోగులు పాలక పార్టీ వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. ఈ పద్ధతులు మానుకోకపోతే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని కోరారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కౌలు రైతులకు యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి తక్షణమే పనులు ప్రారంభించాలని విన్నవించారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌ను పూర్తి చేయాలని, పంట కాల్వలు కొండవీటి వాగు, గుంటూరు చానల్, నల్లమడ వాగులలో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపు డెక్క తొలిగించాలని, కాల్వల ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలని, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని సమావేశం తీర్మానించిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు వై.నేతాజి, ఎన్. భావన్నారాయణ, కె.నళినికాంత్, ఎం.రవి, ఎస్.చెంగయ్య, బి.వెంకటేశ్వరరావు, డి.వెంకట రెడ్డి, బి.కోటేశ్వరి పాల్గొన్నారు.

భారతమాత వైభవమే బీజేపీ లక్ష్యం

మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ


పాదయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాస రెడ్డి సారథ్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు శుక్రవారం దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతితో ముగిశాయి. ఈసందర్భంగా టీజేపీఎస్ కళాశాల పాట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి పట్టాభిపురం స్వామి వివేకానంద సెంటర్ మీదుగా పాదయాత్ర నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి కలగాలని నివాళులర్పించారు. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న మారణకాండను ప్రజలు ఖండించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ మాగంటి సుధాకర్, బీజేపీ, జనసేన నేతలు పాకనాటి రమాదేవి, మకుటం శివ, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ గుడిబండి సాంబిరెడ్డి, బండారుపల్లి రోశయ్య, మర్రి శంకరరావు, వెలగలేటి గంగాధర్, బొలగాని సాంబయ్య, బొల్లాప్రగడ శ్రీదేవి, జెట్టిబాబు, కపిలవాయి బదరీనారాయణ, సరస్వతినంధి, పోకూరి జితేంద్ర, ముత్యం నరేంద్ర, అంకాల శ్రీనివాసరావు, చాపల రంగారావు, తాడువాయి రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆరో వర్ధంతి సందర్భంగా గుంటూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ళ అనంతపద్మనాభం సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక్ భీమినేని చంద్ర శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, ఆవుల రాము, షేక్ సాంబశివరావు, కారంశెట్టి రమేష్, యారవ శ్రీను, నాగమల్లీశ్వరి, అజయ్ పాల్గొన్నారు.

సామాజిక భద్రత కల్పించే అతిపెద్ద సంస్థ..



నగరంపాలెం: ప్రపంచంలో అతిపెద్ద సామాజిక భద్రత కల్పించే సంస్థ అయినా ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అందించే పథకాలను సభ్యులు వినియోగించుకోవాలని ఉద్యోగుల ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ రాజేశ్వర్‌రాజేష్ అన్నారు. బృందావనగార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం జీవన్ ప్రమాన్ అవగాహన సదస్సు, విజిలెన్స్ అవగాహన సదస్సు(2024) జరిగింది. ఆయన మాట్లాడుతూ సాంకేతికను అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు.

సహాయక పీఎఫ్ కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవ శంకర్, దేవస్థానం కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య ప్రసంగించారు. అనంతరం ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సాంస్కృతిక కదంబం పేరుతో శాస్త్రీయ సంగీత, వీణ కచేరిలు, భక్తి గీతాలాపన, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రామశేషున్, డి.సాయిఆనంద్‌కుమార్, అనూష, కె.సుధాకర రావు, ఎం.కృష్ణార్జున్ పాల్గొనగా, పి.కుమార్ శేఖర్ వ్యాఖ్యాతగా రిక్రియేషన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

గుంటూరు మెడికల్: ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడిని నిరసిస్తూ శుక్ర వారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఘటనకు కారణమైన నిందితులను ఉరితీయాలని, లేడీ డాక్టర్స్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా వైద్యులు పని చేసే ప్రాంతంలో అన్ని రకాల జాగ్రత్తలు యాజమాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ ఈ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

19న శ్రీచౌడేశ్వరి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

నగరంపాలెం: నల్లపాడురోడ్డు సాయినగర్‌లోని మహాగణపతి కుమారస్వామిసహిత చౌడేశ్వర చంద్రశేఖర సమన్విత చక్రాలయంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ క్రతువు, కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తోన్నట్లు ఆలయ సర్వాధికార ప్రతినిధి విశ్వంభరానంద గిరిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మూడు రోజులపాటు కల్యాణ వైభవ పూజలు జరుగుతాయని అన్నారు. శ్రీవశిష్ట హరరామ జన యజ్ఞ ఆశ్రమ పీఠాధిపతుడు ప్రణవానంద గిరిస్వామి ఆశీస్సులు, ఆలయ శాశ్వత ధర్మకర్త కొమ్మన నరసింహారావు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరగునున్నాయని ఆయన తెలిపారు.

బీసీ ఉద్యమం సంస్థ నగర కన్వీనర్‌గా సత్యనారాయణ

నెహ్రూనగర్: రాష్ట్రంలో అధిపత్య కులాల రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రత్యామ్నాయ రాజకీయ దృక్పథంతో ఏర్పాటైన స్వతంత్ర్య బీసీ ఉద్యమం సంస్థకు నగర కన్వీనర్‌గా సాదం సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు అరండల్‌పేటలో నగర కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ బీసీలు ఏకతాటిపై రావడానికి తగిన కార్యాచరణతో ఈ నెల 24వ తేదీన గుంటూరులో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ నాయకులు, హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావుతో పాటు పీవీ రమణయ్య, కె.నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రామారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు


మంగళగిరి కనకదుర్గ ఆలయంలో పూజలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళాశాసనములతో ఉదయం 9 గంటలకు ధనలక్ష్మి, సంతానలక్ష్మి అమ్మవార్లకు తిరుమంజన సేవ, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ పెరుమాళ్లకు అభిషేకం ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం శ్రీసూక్త హవనం, భూ వరాహ హోమం, అలంకరణ, అష్టోత్తర శతనామ పూజ, సాయంత్రం సహస్ర నామార్చన, వరలక్ష్మీ వ్రతం, నివేదన, నక్షత్ర హారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజయకీలాద్రి అర్చక స్వాములు, జీయర్ వేదపాఠశాల వేదవిద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూలాంకురేశ్వరికి శ్రావణమాస పూజలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మకు అర్చకులు అయ్యన్నశాస్త్రి విశేష కుంకుమార్చనలు చేశారు. మండపంలోని అమ్మవారి శ్రీచక్రానికి ఖడ్గమాలతో పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేమవరం: గ్రామంలోని మహంకాళీ సహిత మహాకాళేశ్వరుడి ఆలయంలో భక్తులతో శ్రీచక్రాలకు కుంకమార్చనలు, సహస్రనామ పూజలు అర్చకులు ఆదర్శశాస్త్రి చేయించారు. భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నుదురుపాడు: గ్రామంలోని అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పూర్ణచంద్ర శాస్త్రి మూలమూర్తులకు అభిషేకాలు చేసి కుంకుమార్చనలు నిర్వహించారు.

కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

మంగళగిరి: పట్టణంలోని పాతమంగళగిరి జాతీయ రహదారి వెంట ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతం నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎయిమ్స్ వైద్య విద్యార్థుల నిరసన


ఎయిమ్స్ వద్ద ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

మంగళగిరి: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎయిమ్స్ విద్యార్థులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎయిమ్స్‌లో వైద్య విద్యార్థినిపై దాడిని ఖండిస్తూ విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. సమాజంలో పవిత్రమైన వృత్తిలో ఉండే డాక్టర్లుకు విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల డాక్టర్లపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వాల ఉదాసీనత వైఖరి కారణంగా ఇలాంటి ఘటనలు పునరావృత్తమవుతున్నాయని ఆరోపించారు. నిందితులకు ప్రభుత్వం వెంటనే శిక్షించాలని లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను లైంగిక దాడి చేసి హత్యచేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు డి. రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని కొలనుకొండలోని సంఘ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌కు న్యాయం చేయాలని, ఆత్మహత్య అంటూ కేసును పక్కదోవ పట్టించి నేరస్తులను తప్పించేందుకు ప్రయత్నించి ప్రిన్సిపాల్‌కు రెండు రోజుల్లో పోస్టింగ్ ఇవ్వడం దారుణమని, ఆ ప్రిన్సిపాల్‌ను వెంటనే అదుపులోకి తీసుకోవాలని కోరారు. మన రాష్ట్రంలో వివిధ మెడికల్ కాలేజీలలో కూడా రక్షణ లేదని, ఏపీలో జూనియర్ డాక్టర్లు ఆందోళనకు పూనుకున్నారని పేర్కొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న ఫ్లెక్సీ చించివేత


చుట్టుగుంట సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాగగౌడ్ తదితరులు

నెహ్రూనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని గౌడ జాతి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దొంత నాగగౌడ్ చుట్టుగుంట సెంటర్‌లో గౌతు లచ్చన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని ఫ్లెక్సీని చించివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చుట్టుగుంట సెంటర్‌లో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పక్కనే టీడీపీ నేతలకు సంబంధించి ఫ్లెక్సీలు గత కొద్ది రోజుల తరబడి ఉన్నప్పటికి వాటికి ఏమి కాకుండా గురువారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేయడం సమంజసం కాదన్నారు. కావాలనే టీడీపీ శ్రేణులు గౌడ జాతిని అవమానించేందుకు ఫ్లెక్సీ చింపివేశారని ఆరోపించారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి మురళీకాంత్ ఎంపిక



తెనాలిఅర్బన్: సదరన్ ప్రైవేట్ లిమిటెడ్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారి జాతీయ ప్రతిభా పురస్కారానికి తెనాలిలోని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎంపికకు సంబంధించిన పత్రాన్ని పంపినట్లు ఆయన తెలిపారు. మురళీకాంత్ బిట్స్ పిలానీలో ఎంటెక్ పూర్తి చేసి కొంతకాలం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 12 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు విద్యనందించారు. ఈ నెల 25న గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగే ప్రధానోత్సవ కార్యక్రమంలో పురస్కాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అందించనున్నట్లు చెప్పారు. అవార్డుకు ఎంపికైన ఆయనను పలువురు అభినందించారు.

ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి

ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడిల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా సమావేశం శుక్రవారం గుంటూరు వైద్య కళాశాలలోని కార్యాలయంలో నిర్వహించారు. సంఘం గుర్తింపు పొంది నేటికి 5 సంవత్సరాలు అయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా మాట్లాడుతూ జిల్లాలో తన దృష్టికి వచ్చిన ప్రతి ఉద్యోగి సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏ సంఘం నిర్వహించలేని జిల్లా కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసి ఉద్యోగుల్లో చైతన్యం నింపామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర శాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, పెదరత్తయ్య, నాగూర్ వలి, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు, మహిళా విభాగం సంఘం నాయకులు షబానా సుల్తానా పాల్గొన్నారు.

- **తెనాలిరూరల్:** మండలంలోని కఠెవరం గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన షేక్ నసీమా, కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఆరుబయట నిద్రించారు. అర్ధరాత్రి దాటాక లేచి చూడగా ఇంట్లోని బీరువా తెరిచి ఉండి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలను నమోదు చేశారు.